బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 22 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4

## 24 గంటలూ దుకాణాలు తెరుచుకోవచ్చు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రంజాన్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రంజాన్ మాసంలో 24 గంటలూ దుకాణాలు తెరిచేలా రేవంత్ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. రంజాన్ మాసంలో మార్చి 2వ తేదీ నుంచి 31 వరకు 24 గంటల పాటు దుకాణాలు తెరవవచ్చని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈమేరకు సీఎస్ శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. దానికి తోడు రోజుకు 8 గంటలు లేదా వారానికి 48 గంటలకు పైగా పనిచేసే సిబ్బందికి రెట్టింపు వేతనాలు ఇవ్వాలని నిర్ణయించింది. అదే విధంగా.. మహిళ ఉద్యోగులు ఉంటే వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు తీసుకొవాలని పేర్కొంది. ఈ మేరకు సంబంధిత శాఖలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో 476ను తప్పనిసరిగా పాటించాలని అధికారులు ఆదేశించారు. రంజాన్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రంజాన్ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది.

### మహిళా సంఘాలు

# ఆర్థికంగా బలోపేతానికి చర్యలు

- ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన చర్యలు
- ప్రజా పాలనలో మహిళలకే తొలి ప్రాధాన్యత
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- నారాయణపేట జిల్లా అప్పకపల్లిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభం



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి వీలుగా ప్రతి జిల్లా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తొలి దశలో జిల్లా కేంద్రాల్లో ఆ తర్వాత ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక్కొక్క పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసుకోవడానికి ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించాలని చెప్పారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటిదిగా నారాయణపేట జిల్లా అప్పకపల్లిలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాలను ఉద్దేశించి మాట్లాడారు.

"పట్టణ, గ్రామీణ సంఘాలన్న తారతమ్యాలు లేకుండా మహిళలంతా ఒక్కటే. తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళల్ని స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా చేర్చాల్సిన అవసరం ఉన్నది. కోటి మందిని చేర్చుకుని అవకాశం వస్తే ఏదో ఒకరోజు మహిళలందరూ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు మొత్తం మన మహిళా శక్తిని ప్రపంచానికి చాటుదాం. ఆ కార్యక్రమానికి ప్రధానమంత్రి గారిని కూడా ఆహ్వానిద్దాం. ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ వస్తోంది. ప్రజా పాలనలో మహిళలకే తొలి ప్రాధాన్యత ఉంటుంది. వారు ఆత్మగౌరవంతో బతికినప్పుడే ఆ కుటుంబాలు నిలబడుతాయి. మహిళా సంఘాలకు ఇప్పటికే అనేక పనులు అప్పగించాం.

అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, స్కూళ్లల్లో పిల్లల యూనిఫామ్‌లు కుట్టించే కార్యక్రమాలను అప్పగించాం. ఐకేపీ కేంద్రాలు మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. మహిళా సమాఖ్యల ద్వారా 600 బస్సులు ఆర్టీసీకి అద్దెకు నడిపించే కార్యక్రమం ప్రారంభమైంది. దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణలో 1000 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను పెట్టే అవకాశం కల్పించాం. అదానీ, అంబానీలతో పోటీపడి సోలారు విద్యుత్ ఉత్పత్తి చేసే వ్యాపారాన్ని ఆడబిడ్డల చేతికి ఇచ్చాం. గ్రామాల్లో మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను మార్కెట్ చేసుకోవడానికి వీలుగా హైటెక్ సిటీ పక్కన శిల్పారామంలో అత్యంత ఖరీదైన మూడున్నర ఎకరాల స్థలంలో 150 స్టాల్స్ ఏర్పాటు చేశాం. రూ. 67 లక్షల మహిళా సంఘాల సభ్యులకు వెయ్యి కోట్ల రూపాయల మేరకు వెచ్చించి ఏటా రెండు చొప్పున 1.3 కోట్ల నాణ్యమైన చీరలు ఇవ్వాలని నిర్ణయించాం.

పాఠశాలల్లో ముఖ్యంగా ఆడపిల్లల బాధలు వారి తల్లులకే ఎక్కువగా తెలుస్తాయి. అందుకే స్కూళ్ల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. బడులను బాగా చూసుకోవాలి. నిధులు ప్రభుత్వం ఇస్తుంది. నిర్వహణ మీరు చూసుకోవాలి. నిర్వహణ సరిగా చేయకపోతే ప్రయోజనం ఉండదు. టీచర్లు రాకపోతే కలెక్టర్లకు ఫిర్యాదు చేయండి. టీచర్లు రాకపోతే ప్రభుత్వం ఎంత ఖర్చు చేసినా ప్రయోజనం లేకుండా పోతుంది. ఊర్లో గుడి కోసం మనమంతా తలా ఒక చేయి వేసి ఎలా అభివృద్ధి చేసుకుంటున్నామో అదే తరహాలో బడిని కూడా ఆ రకంగా నిర్వహించుకోవాలి. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహించుకుంటామో బడిని కూడా అదే తీరులో చూసుకోవాలి" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ గారు, జూపల్లి కృష్ణారావు గారు, ధనసరి సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, లోక్‌సభ సభ్యులు డీకే అరుణ గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఉమ్మడి జిల్లాకు చెందిన శాసనసభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం సందర్శించి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహా , జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## భారత్ నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారు కావాలి

- ప్రధాని మోడీ
- స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్షిప్ సదస్సును ప్రారంభించిన ప్రధాన మంత్రి మోడీ

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలని ప్రధాని సరేంద్ర మోదీ ఆకాంక్షించారు. రాజకీయా లు, క్రీడలు, కళలు, మీడియా, ఆధ్యాత్మికం, వ్యాపారం సహా అన్నిరంగాల నుంచి ప్రపంచస్థాయి లీడర్లు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీలోని భారత మండపంలో స్కూల్ ఆఫ్ ఆల్టిమేట్ లీడర్ని పీ పోటీ నదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ మంద సమస్యలు, అవసరాలను తీర్చే మేదస్సు కలిగిన నాయకులు తయారు కాలపేర్కొన్నారు. ప్రస్తుతం చాదర్ వండి శక్తి కేంద్రంగా అవతరిస్తోందని మోదీ చెప్పారు. ఈ ఒరవడిని మరింత వేగంగా ముందుకు తీసు శక్తిసాము ర్నాలకు నాయకులు అందరు కోణాలని సూచించారు. ఈ మేరకు నాయకులను తయారుచేసే విషయంలో 'సోల్' గేమ్చేంజ 5గా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఒకప్పుడు మహారాష్ట్ర నుంచి విడిపోయిన గుజరాత్ ఎలాంటి వనరులు లేకుండా ఎలా అభివృద్ధి చెందుతుందని అనే ఆందోళన వృక్షమైందని మోదీ గుర్తుచేశారు. అయితే ఆ రాష్ట్రంలో ఉన్న నాయకుల కారణంగానే గుజరాత్ మంచి అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ భారత్తో పాటుయావత్ ప్రపంచంలో సరైన ముద్ర వేయగలిగినర్లు స్కూల్ ఆఫ్ అల్టిమేట్ వీడడిపిన్ నుంచి వస్తారని నాకు విశ్వాసం ఉంది. ఇక్కడ శిక్షణ తీసుకొని బయటకో చ్చిన యువకులు రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించవచ్చు. ఏ దేశమైనా అభివృద్ధి సాధించింది అంటే సహజంగా అందులోని సహజవనరుల పాత్ర కీలకంగా ఉంటుంది. అంతకంటే ఎక్కువగా మానవవనరుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ నదస్సులో భూటాన్ ప్రధాని రషో షేరింగ్ గోల్టే కూడా పాల్గొన్నారు. సోల్ అనేది నరేంద్ర మోదీకి వచ్చిన కళాత్మక ఆలోచన అని తోల్గే అభివర్ణించారు. భారతదేశానికి సేవ చేయడానికి అనుగుణంగా యువతను శక్తివంతం చేయడంలో మోడికున్న అనం. చలమైన నిబద్ధతకు ఇది నిదర్శమని పేర్కొ న్నారు. మోదీని తన గురువు. అన్నయ్య గా తోట్టే పేర్కొన్నారు. ఆయనను కలిసినప్పుడు ప్రజా సేవకుడిగా మరింత కష్టపడి పనిచేయ బానికి తనకు ప్రేరణ లభిస్తుందని అన్నారు. ప్రధాని మోదీ నా అన్నపు మద్యుల్ని కలి అవకాశం వచ్చిన ప్రతిసారీ నేను ఆనందంతో ఉప్పొంగిపోతాను మీరు నాకు గురువు. మమ్మల్ని కలిపి ప్రతి సేవకుడిగా మనంత కనండి పనిచేయడానికి వేరు పొందుతాడు అని చెప్పారు.

## మోడీ, కేసీఆర్ పాలనపై చర్చిద్దాం రండి

- డ్రేట్, ప్లేస్, సమయం చెప్పండి.. నేనూ, మంత్రి దామోదర కలిసి చర్చకు వస్తాం
- ప్రాలమూరు ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదు ?
- ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవద్దు
- న్రారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 2వ పేజీలో



రాష్ట్రంలో మొదటి విడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. నారాయణపేట జిల్లా అప్పకపల్లి గ్రామంలో దళిత మహిళ బంగలి దేవమ్మ , భర్త నర్సింగ్ దంపతుల ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమి పూజ నిర్వహించారు. ఇండ్ల నిర్మాణానికి పత్రాలు అందుకున్న గ్రామ మహిళలు ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహా గారు, జూపల్లి కృష్ణారావు గారు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, లోక్ సభ సభ్యురాలు డీకే అరుణ గారితో పాటు జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నిరుపేదలకు విద్య అందుబాటులోకి వచ్చినప్పుడే అభివృద్ధి



- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నిరుపేదలకు విద్య అందుబాటులోకి వచ్చినప్పుడే రాష్ట్రం అభివృద్ధి పథాన నడుస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఎన్ని రకాలుగా మౌలిక సదుపాయాలు కల్పించినప్పటికీ వాటిని అందిపుచ్చుకున్నప్పుడే సరైన ఫలితాలు వస్తాయని చెప్పారు. నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ, హాస్టల్ భవనాలు, నర్సింగ్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, 50 ఏళ్ల ప్రజా జీవితంలో ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించిన చిట్టెం నర్సిరెడ్డి పేరును ఈ మెడికల్ కాలేజీకి పెట్టడం సముచితంగా ఉంటుందని అన్నారు. "పేదలకు విద్య అందుబాటులోకి తీసుకురావడానికి మా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది. మిగితా 2వ పేజీలో

## ఫిర్యాదుదారు చనిపోతే విచారణ ఎలా నిర్వహిస్తాం

- హైకోర్టు
- మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై హైకోర్టులో శుక్రవారం విచారణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ లోపాల విషయంలో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు మీడియా ద్వారా తెలిసిందని, ఫిర్యాదుదారు చనిపోయిన తర్వాత విచారణ ఎలా నిర్వహిస్తామని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ నిర్వహించొచ్చని ఈ మేరకు కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వాదనలు వినిపించడానికి గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు సోమవారాని(ఫిబ్రవరి 24)కి వాయిదా వేసింది.

మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి నాసిరకం నిర్మాణాలు, సరైన డిజైన్ లేకపోవడమే కారణమని భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి అనే వ్యక్తి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణను స్వీకరిస్తున్నట్లు జిల్లా కోర్టు గతేడాది జూలై 10న ఉత్తర్వులు జారీ చేసింది. కేసీఆర్, హరీశ్ రావుతో పాటు మరికొంత మందికి నోటీసులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఫిర్యాదుదారు రాజలింగమూర్తి మొదట భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేయగా దానిని కొట్టేశారని, ఆ తర్వాత జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారని కేసీఆర్ తరపు న్యాయవాది గత విచారణ మిగితా 2వ పేజీలో

## రూ.3 వేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యువతకుస్వయం ఉపాధి పథకాలు

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని..అందుకోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రానున్న బడ్జెట్‌లో రూ.మూడువేల కోట్లతో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు రూపొందించాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి సమీక్ష నిర్వహించారు. ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. రాష్ట్రాన్ని పదేండ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలను పూర్తిగా పక్కన పెట్టిందని విమర్శించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా ఈ అంశాల్లో ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకుని ఆర్థిక శాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు ఫాలో అప్ చేసుకోవాలని ఆదేశించారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్‌ను సంక్షేమ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులకు గుర్తుచేయాలని కోరారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావాల్సిన నిధులపై కసరత్తు చేసి సీరియస్ గా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో మిగితా 2వ పేజీలో

## జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఉత్కంఠ రేపిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఎట్టకేలకు మరోసారి ఏకగ్రీవమైంది. సంఖ్యా బలం లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్ విత్ డ్రా చేసుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎఐఎంఐఎం నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బీజేపీ దూరంగా ఉంది. అయితే అడ్డగుట్ట కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. జీహెచ్‌ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకుంటారు. గత పదేండ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమవుతూ వస్తోంది. గత పదేండ్లలో తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించుకున్నారు.

## రూ.6 వేల కోట్ల కంటే ఎక్కువ ఇవ్వలేం

- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో రాష్ట్రానికి కేంద్రం ఝలక్
- 10 లక్షల పీఎంఏవై అర్బన్ యూనిట్ల" కేటాయించాలని రాష్ట్రం ప్రతిపాదనలు
- ఐదేళ్లకు రూ.15 వేల కోట్లు ఇవ్వాలని రాష్ట్రం వినతి
- కేంద్ర నిర్ణయంతో రాష్ట్ర సర్కార్పై ఆర్థిక భారం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఆదిలోనే హంసు ఎదురైంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎం పథకం కింద పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ సంఖ్యను పెంచడం ద్వారా కేంద్రం నుంచి బా నిధులుపొందాలని రాష్ట్ర సర్కార్ చేసిన ప్రయత్నం కొట్టింది. పట్టణ ప్రాంత పేదల ఇళ్ల నిర్మాణాలకు అట నిధులు సాధించి ఇందిరమ్మ పథకం ఖర్చును బా తగ్గించుకోవాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం) బీజేపీ సర్కార్ షాకిచ్చింది. పీఎంఏవై కింద పట్టణపా ఇళ్ల నిర్మాణం కోసం పదేళ్లకు రూ.15 వేల కోట్లు మును ని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనను తిరస్కరించి పీఎంఏవై అర్బన్ పథకం కింద రూ. 6 వేల కోట్లుమా ఇస్తామని తేల్చి చెప్పింది. కేంద్రం ఇచ్చిన షాక్ ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బతగిలింది.

కేంద్ర సాయం భారీగా తగ్గడంతో ఇందిరమ్మన పథకం అమలులో రాష్ట్ర ఖజానాపై పెనుభారం పడనుంది. వచ్చే మిగతాఆర్థిక సంవత్సరం కేంద్రం. పీఎంఏవై కింద మిగితా 2వ పేజీలో

## కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశం వాయిదా

**సమావేశానికి హాజరుకాలేకపోతున్నామన్న ఏపీ — 24కు వాయిదా**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కృష్ణానదీ యాజమాన్య బోర్డు అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశం ఈ నెల 24కు వాయిదా పడిరది. ప్రస్తుత నీటి సంవత్సరంలో మిగిలిన కాలానికి రెండు రాష్ట్రాలకు నీటి వాటాలు, ఇతర అంశాలపై చర్చించేందుకు కేఆర్ఎంబీ ప్రత్యేక సమావేశానికి ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి, తెలంగాణ నీటిపారుదల ముఖ్య కార్యదర్శితో కృష్ణాబోర్డు చైర్మన్ అతుల్ జైన్ మధ్యాహ్నం సమావేశం కావాల్సి ఉంది. అయితే తనకు ముందుగానే నిర్ణయించిన ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నందువల్ల సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని, సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఏపీ స్పెషల్ సీఎస్ బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో ప్రత్యేక సమావేశాన్ని కేఆర్ఎంబీ సోమవారానికి వాయిదా వేసింది. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు హైదరాబాద్ జలసౌధ లో సమావేశం జరగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు బోర్డు సమాచారం పంపించింది.

## ఎల్ఆర్ఎస్ పేరుతో 50కోట్ల దోపిడీకి స్కెచ్

- కేంద్రమంత్రి బండి సంజయ్



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని డబ్బులు వసూలు చేస్తారా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర బడ్జెట్‌పై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్రమంత్రి బండి సంజయ్ పెద్దపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎల్ఆర్ఎస్ పేరుతో రూ.50వేల కోట్ల దోపిడీకి కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని ఇప్పుడు డబ్బులు వసూలు చేస్తారా?. ఎన్నికల సమయంలో మీరు ఇచ్చిన హామీ ఇదే(ఉచితంగా ఎల్ఆర్ఎస్ చేస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడిన వీడియో). ఇప్పుడు ఎందుకు మాట మార్చుతున్నారు?. కాంగ్రెస్ పార్టీ బర్త్, డెత్ రెగ్యులరైజేషన్ స్కీంలను కూడా ప్రవేశపెడతారేమో అంటూ ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో కేంద్ర బడ్జెట్‌పై దమ్ముంటే బహిరంగ చర్చకు రండి. మీకు చేతనైతే బీసీ రిజర్వేషన్లపై టెన్ జనపథ్ ఎదుట ధర్నా చేయండి. కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి, బీజేపీ పోరాటాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికల్లో కచ్చితంగా బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇదిలా ఉండగా.. ఈ నెల 27న మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలతోపాటు వరంగల్- ఖమ్మం- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగనుంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి.

### రూ.3 వేల కోట్లతో
## ఎస్సీ, ఎస్టీ యువతకుస్వయం ఉపాధి పథకాలు

(మొదటిపేజి తరువాయి)

వేగం పెంచాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ ,ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రూపొందించాలనీ, రాబోయే రెండేండ్లలో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆయా వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ శాఖ అధికారులు ఆయా వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఏ సూచన చేసినా అమలు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఇరిగేషన్ సెక్రెటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.6 వేల కోట్ల కంటే ఎక్కువ ఇవ్వలేం

(మొదటిపేజి తరువాయి)

దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో కోటి, గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుం ది. ఈ క్రమంలో ఆయారాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఇండ్ల పథకాలకు ఎప్ప టిలాగే వచ్చే ఆర్థిక సంవత్సరము ఆర్థిక చేయూతనివ్వాలని నిర్ణయం తీసుకున్న ది. ఈ క్రమంలో పథకాన్ని రెండుగా వర్గీ కరించిన కేంద్రం సేవంపై నైలో జర్మన్లో యూనిట్ కాస్ట్ రూ.లక్షన్నర, రూరల్లో రూ. 72 వేలుగా మంజూరు చేస్తూ వస్తు న్నది. కేంద్రం అందిస్తున్న సాయాన్ని లుసుకున్న ప్రభుత్వం అత్యధిక నిధులు రాబట్టుకునేలా ప్రణాళిక రూపొందిం చింది. ఈ క్రమంలో అర్బన్ యూనిట్లు ఎక్కువగా పొందాలని రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకువెళ్లింది. ఇందుకోసం రాష్ట్రంలో పట్టణ ప్రాంత విస్తీర్ణం, జనాభా ఎక్కువగా ఉందని చూపేందుకు ఇటీవల పట్టణప్రాంత అభి వృద్ధి సంస్థలను అమాంతం పెంచేసింది ఈ క్రమంలో గతంలో తొమ్మిది పట్టణు ప్రాంత అభివృద్ధి సంస్థలు ఉండగా. వాటిని 288 పెంచేసింది. ఫలితంగా వేల సంఖ్యలో గ్రామ పంచాయతీలు 'పట్టణ పరిధిలోకి చేరాయి. వీటి ఆధారంగా కేటాయించాలని, వీటికి రూ లక్షన్నరు. చొప్పున రూ.15 వేల కోట్లు ఇవ్వాలని రాష్ట్రానికి 10 లక్షల అర్మన్ యూనిట్లు తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ నిధులు వస్తే ఇందిరమ్మ ఇళ్ల నిర్మా ఇంలో రాష్ట్రంపై భారం తగ్గుతుంది. నిధులు సమీకరణ సవాలే..!

రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఇంటికి గరిష్టం గా రూ.5 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించినందున. ఒక్కో ఇంటికి రూ. లక్షన్నర చొప్పున ఖర్చు తగ్గుతుంది. కానీ, కేంద్రం దేశంలోని మొత్తం పట్టణ జనాభాలో తెలంగాణ వాటా కేవలం నాలుగు శాతమని తేల్చింది. ఈ లెక్కన రాష్ట్రానికి నాలుగు లక్షల యూనిట్లు. రూ.6 వేల కోట్లు రానున్నాయి. ఇదే జరిగితే రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం అధికంగా ఉండనుంది. కేంద్రం నుంచి నిధులు బాగా తగ్గముండటంతో, సొంతంగా నిధులు సమీకరించుకోవా ల్సిన పరిస్థితి తలెత్తింది. దీంతో కేంద్రంపై మళ్లీ ఒత్తిడిపెంచిమనసు మార్చాలని భా విస్తోంది. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో రెండుకోట్ల ఇళ్లను నిర్మించాలని కేంద్రం: లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ క్రమంలో తెలంగాణకు ఏడాదికి లక్షన్నర వరకు ఇండ్లు మంజూరయ్యే అవకాశం ఉంది. కానీ వీటి లెక్కలను మాత్రం కేంద్రం ఇంకా తేల్చలేదు. అర్బన్ యూనిట్లతో పోలిస్తే ఇవి రెట్టింపు సంఖ్యలో మంజూ రవుతాయని రాష్ట్రం అంచనా వేస్తోంది. వాటిలో రాష్ట్ర ఖజానాకు అంతగా ఉపయోగంలేకుండాపోయింది. వీటి యూనిట్ కాస్ట్ తక్కువ కావడంతో వాటితో రాష్ట్ర ఖజానాకు అంతగా ఉపయోగం లేకుండా పోయింది.

## కూతురు పెండ్లిలో గుండెపోటుతో తండ్రి మృతి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



వివాహ వేడుకల్లో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి. కూతురు పెండ్లిలో గుండెపోటుతో తండ్రి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని రామేశ్వర్‌పల్లిలో శుక్రవారం చోటుచ ేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామేశ్వర పల్లి గ్రామానికి చెందిన కుడిక్యాల బాలచంద్రంకు ఇద్దరు కూతుళ్లు ఉండగా పెద్ద కూతురు కనక మహాలక్ష్మి వివాహం మండల పరిధిలోని బేసిక్ ప్రాంతంలో విశాలమైన ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అక్కడ బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కన్యాదానం చేస్తున్న సమయంలో బాలచంద్రంకు గుండెపోటు వచ్చింది. వెంటనే అక్కడ ఉన్న బంధుమిత్రువులు గమనించి ఆయనను కామారెడ్డి జిల్లా కేంద్రంలో గల ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికీ ఆయన మృతి చెందినట్లు వైద్యులు, ధ్రువీకరించారు దీంతో కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో మండపంలో విషాదఛాయలు చేసుకున్నాయి. అక్కడ మంటపంలో కార్యక్రమాలను హుటాహుటిన ముగించుకున్నారు. మండపంలో ఉన్న ప్రతి ఒకరు కంటతడి పెడుతూ మృతుని ఇంటికి తరలి వెళ్లారు.

## మదీనాకు ఇండిగో కొత్త విమాన సేవలు ప్రారంభం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జిఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం (జిహెచ్ఐఎఎల్) శుక్రవారం ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి హైదరాబాద్ నుంచి మదీనాకు కొత్త విమాన సేవలను ప్రారంభించింది. తొలి విమానం జిహెచ్ఐఎఎల్ సీనియర్ అధికారుల సమక్షంలో బయలుదేరింది. ఈ సేవలు ప్రతి వారం మూడు రోజులు– సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయి.

# మోడీ, కేసీఆర్ పాలనపై చర్చిద్దాం రండి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



పన్నేండ్లుగా దేశాన్ని ఏలుతున్న మోడీ, కేసీఆర్ పదేండ్ల పాలన.. ఏడాది కాలంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రజాపాలనపై చర్చకు సిద్ధమా..? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పాలన బాగోలేదని, గట్టిగా కొడతామని కేసీఆర్ అంటున్నారు. ఎవరి పాలన ఏంటో తేల్చుకుందాం. ప్లేస్, సమయం, తేదీ నిర్ణయించండి.. ఎవరెవరు వస్తారో చర్చలకు రండి. మా వైపు నేను, మంత్రి దామోదర కలిసి వస్తాం. చర్చల్లో మేం ఓడితే ముక్కును నేలకు రాస్తా' అని రేవంత్ అన్నారు. నారాయణపేట జిల్లా పరిధిలో శుక్రవారం సుమారు రూ.వెయ్యి కోట్లతో వివిధ సంక్షేమ పథకాలను సీఎం ప్రారంభించారు. వికారాబాద్ దుంద్యాల మండలం పోలెపల్లి ఎల్లమ్మ జాతర సందర్భంగా పూజలు నిర్వహించారు. మహిళా సమాఖ్య భవనం, పెట్రోల్ బంక్, మెడికల్ కళాశాల మొదటి బ్లాక్ ప్రారంభం, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ తమది రైతు ప్రభుత్వం అని చెబుతూనే.. రైతు వ్యతిరేక నల్లచట్టాలు తెచ్చి.. ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు. రైతులు ఉద్యమించి ప్రధాని మోడీ మెడ వంచి ఆ చట్టాలను వెనక్కి తిప్పికొట్టారని గుర్తు చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పారని, ఎంతమంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయని ప్రశ్నించారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నా.. రాష్ట్రానికి నిధులు తీసుకురాలేకపోయారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా పదేండ్లపాటు అధికారంలో ఉండి.. పాలమూరు ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీగా గెలిచి.. ఆ తర్వాత సీఎం అయిన కేసీఆర్.. తుమ్మిళ్ల, కల్వకుర్తి, నెట్టెంపాడు, జూరాల, పాలమూరు–రంగారెడ్డి, కోయిల్‌సాగర్, బీమా ఎత్తిపోతల పథకాలను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేయకపోగా శ్రీశైలం నీటిని ప్రతిరోజూ 10 టీఎంసీలను రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా ఏపీకి తరలించే ప్రయత్నాలను అడ్డుకోలేదని విమర్శించారు. వైఎస్ రాజశేఖ ర్‌రెడ్డికి ఊడిగం చేసి పోతిరెడ్డిపాడుకు జలాలను తరలించుకు పోయేందుకు సహకరించారని అన్నారు. ఆ తర్వాత ఏపీ సీఎం జగన్‌తో కేసీఆర్ చీకటి ఒప్పందం చేసుకుని రాయలసీమ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చారన్నారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం పెట్టి ఉండేది కాదన్నారు. ఆనాటి పరిస్థితులే నేడు చంద్రబాబుతో నీటి పంచాయతీకి కారణమన్నారు. కేసీఆర్ కొట్టాలంటే తప్పుచేసిన కొడుకు, కూతురు, అల్లుడును కొట్టుకోవాలని, కాంగ్రెస్ కార్యకర్తలను కొడతానంటే ఊరుకోరని హెచ్చరించారు. తమ హయాంలో ఆర్టీసీ ఫ్రీ జర్నీ, గ్యాస్, ఉచిత కరెంట్‌తోపాటు అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

స్థానిక ఎన్నికల్లో ఇందిరమ్మ ఇండ్లు ఉన్న గ్రామాల్లోనే తాము పోటీ చేస్తాం.. డబుల్ బెడ్‌రూమ్స్ ఉన్న గ్రామాల్లోనే పోటీ చేయడానికి బీఆర్ఎస్ నేతలు సిద్ధమా అని ప్రశ్నించారు. మార్చి 31 నాటికి రైతు భరోసా ప్రతి రైతు ఖాతాలో వేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మిస్తే.. కాంగ్రెస్‌కు మంచి పేరు వస్తోందని ప్రజలను రెచ్చగొట్టి లగచర్లలో జిల్లా కలెక్టర్‌పై దాడులు చేయించారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు లక్ష కోట్లలో వేల కోట్లు కమీషన్ తీసుకున్న చరిత్రమీదన్నారు. మక్తల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం గురించి తాను 2014లో నాటి అసెంబ్లీలో మాట్లాడానని, అది తాను సీఎం అయిన తర్వాత కార్యరూపం దాల్చిందన్నారు. గత పాలకులు ప్రాజెక్టులు సరిగ్గా నిర్మించి వుంటే.. కృష్ణా జలాల వాటాలో మనకు రావాల్సిన 811 టీఎంసీల నీళ్ల వినియోగంలోకి వచ్చేవని తెలిపారు. అందుకే పదేండ్ల గత పాలకుల పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనను ఒకసారి చూసి ప్రజలు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, దామోదర రాజనర్సింహా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు వాకిట శ్రీహరి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, అనిరుధ్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారు చనిపోతే విచారణ ఎలా నిర్వహిస్తాం

(మొదటిపేజి తరువాయి)

సందర్భంగా కోర్టుకు తెలిపారు. జిల్లా కోర్టుకు విచారణ పరిధి లేకున్నా ఉత్తర్వులు జారీ చేశారని వాదించారు. కేసీఆర్ తరపు న్యాయవాది వాదనతో ఏకీభవించిన హైకోర్టు, జిల్లా కోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. కేసీఆర్ పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా జిల్లా కోర్టులో ఫిర్యాదుచేసిన రాజలిం గమూర్తి మృతి చెందినట్లు కేసీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై ఇక విచారణ అవసరం లేదని న్యాయమూర్తి అన్నారు. ఒకవేళ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసినా తిరిగి భూపాలపల్లి జిల్లా కోర్టులో విచారణ నిర్వహించాల్సి ఉంటుందని ప్రస్తావించగా, అక్కడ ఫిర్యాదు చేసిన వ్యక్తే మృతి చెందినప్పుడు ఇక విచారణ ఎలా? నిర్వహిస్తారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించిన తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించడంతో హైకోర్టు తదుపరి విచారణను 24వ తేదీకి వాయిదా వేసింది.

## నిరుపేదలకు విద్య అందుబాటులోకి వచ్చినప్పుడే అభివృద్ధి

(మొదటిపేజి తరువాయి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారు చెప్పినట్టు రంగుల గోడలు, అద్దాల మేడలు అభివృద్ధి తీసుకురావు. నిజమైన పేదవాడికి సంక్షేమం అందినప్పుడు, ముఖ్యంగా విద్య వారికి చేరినప్పుడే అభివృద్ధి చెందుతుంది. రంగుల గోడలు, అద్దాల మేడలు ప్రభుత్వం నిర్మించగలదు. కానీ విద్యలో రాణించాలంటే వాటిని సరైన విధంగా ఉపయోగించుకున్నప్పుడే దాని ఫలితాలు అందుతాయి.గతంలో కేంద్ర ప్రభుత్వం తిరస్కరించినప్పటికీ ప్రభుత్వం, అధికారులు తీవ్రంగా ప్రయత్నించి రాష్ట్రంలో 8 మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. డాక్టర్ వృత్తి ఒక ఉద్యోగం కాదు. ఒక బాధ్యత. మీరంతా గొప్ప డాక్టర్లుగా రాణిస్తే రాష్ట్రానికి మంచి సేవలు అందించగలరు.." అని అన్నారు. మంత్రులు, జిల్లా శాసనసభ్యులతో కలిసి ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవనాలతో పాటు ఈ సందర్భంగానే ముఖ్యమంత్రి గారు జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

## పీవీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీగా మంతని జ్ఞాన ప్రకాష్

### ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎట్టేకేలకు పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీకి ఉపకులపతిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీసీ నియామకం విషయంలో చాలా కాలంగా జరుగుతున్న జాప్యానికి ఫుల్ స్టాప్ పెట్టింది. వెటర్నరీ వర్సిటీ వీసీగా మంతని జ్ఞాన ప్రకాశ్‌ను నియమించింది. వీసీ నియామక విషయంలో రెండు సార్లు సెర్చ్ కమిటీలు భేటీ అయినా ఎంపిక ప్రక్రియ ముందుగు సాగలేదు. రాష్ట్రంలోని దాదాపు అన్ని యూనివర్సిటీలకు ఒకే రోజు వీసీలను ఎంపిక చేశారు. ఆ జాబితాలో వెటర్నరీ వర్సిటీ వీసీ పేరు కనిపించలేదు. తాజాగా వెటర్నరీ వీసీ బాధ్యతలను మంతని జ్ఞాన ప్రకాశ్‌కు అప్పగిస్తూ సర్కార్ నిర్ణయం తీసుకుంది.



# గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

**-200 లీటర్ల బెల్లపానకం ధ్వంసం ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం**

**-ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలోని గుడుంబా స్థావరాలపై ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తన సిబ్బందితో యుక్తంగా మద్దిమల్ల, రంగంపేట,అడవిపదిర గ్రామాలలోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించగా 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఐదు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే సారా తయారు చేస్తున్న పలువురు అనుమానితులను వీర్నపల్లి తాసిల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ... ఎవరైనా సరే నాటు సారా తయారు చేసిన,సరఫరా చేసిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పలు గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు మాకు సమాచారం వస్తే ఎవరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ దాడులలో ఎక్సైజ్ డిటిఎఫ్ ఎస్ ఐ శైలజ, హెడ్ కానిస్టేబుల్ సర్దార్, కానిస్టేబుల్స్ రాజు, మల్లేష్, కిషోర్, వర్మ,రాకేష్,సుమన్,శంకర్ లు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో లేని ఇసుక..

**-బీజేపీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కేంద్రం తో పాటు పలు గ్రామాల్లో ప్రజలు సామాన్యులు గృహ నిర్మాణానికి సంబంధించి ఇసుక అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు గురవుతున్నాని బిజెపి మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.... ప్రభుత్వం అధికారులు లేనిపోని ఆంక్షలు విధిస్తూ ఇసుకను అందని ద్రాక్షల మార్చేస్తున్న ఈ ప్రభుత్వం మరియు అధికారులు నిర్ణయాలతో ఇసుక ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి నిర్ణయాలు మార్చుకుంటూ ఎప్పటిలాగే యధావిధిగా ఎక్కడి ఇసుక రిచులు అక్కడనే ఉండాలని ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచాలని తెలిపారు. అలా చేసినట్లయితే ప్రజలకు ఇసుక తక్కువ ధరలకు అందుబాటులో ఉంటాయి లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# టీస్టాల్ తరలింపు

**-బాధితుడితో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద కేటీఆర్ పేరుతో ఉన్న టీస్టాల్‌ను మున్సిపల్ అధికారులు ట్రాక్టర్‌తో అక్కడి నుంచి తరలించారు. సమాచారం అందుకున్న టీ స్టాల్ యజమాని.. అక్కడికి వచ్చి వాహనాన్ని అడ్డుకున్నాడు. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. లైలెన్స్ లేదనే కారణంతో ఇలా చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తొందర్లోనే వస్తా.. చాయ్ దుకాణం మళ్లీ నేనే ఓపెన్ చేస్తానని బత్తుల శ్రీనివాస్‌కు కేటీఆర్ హామీ ఇచ్చారు. హొటల్ నిర్వాహకుడు, బాధితుడు శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి భరోసానిచ్చారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన బాలుడు

**కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ బందాలు**

**బలగం టీవీ , హైదరాబాద్**

లిఫ్టుకు–స్లాబ్‌కు మధ్య ఇరుక్కున్న ఆరేండ్ల బాలుడిని హైడ్రా, డీఆర్ఎఫ్ బృందాలు రక్షించాయి. ఈ ఘటన హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మాసబ్ ట్యాంక్ శాంతినగర్‌లోని మఫర్ కంఫర్టెక్ అపార్టుమెంట్‌లో మధ్యాహ్నం 2 గంటల సమయంలో అర్నవ్ అనే ఆరేండ్ల బాలుడు లిఫ్ట్ డోర్‌కు గోడకు మధ్య ఇరుక్కున్నాడు. హైడ్రాకు ఫిర్యాదు రాగానే డీఆర్ ఎఫ్ రంగంలోకి దిగింది. నాలుగు అంతస్తుల అపార్టుమెంట్‌లో మూడో అంతస్తులో పిల్లలతో ఆడుకుని లిఫ్టు ఎక్కి బాలుడు జారిపడినట్టు స్థానికులు తెలిపారు. లిఫ్ట్ ఎవరూ ఆపరేట్ చేయకుండా ముందుగా కరెంటు కనెక్షన్ తొలగించారు. ఆ వెంటనే డీఆర్ఎఫ్ బందాలు ఆపరేషన్ మొదలు పెట్టా యి. గ్యాస్‌కట్టర్లు, ఫైర్ విభాగానికి చెందిన పనిముట్లతో లిఫ్టు ఫ్రేమ్‌ను కట్ చేసి స్లాబ్‌ను కూడా అతి కష్టమ్మీద కట్ చేసి బాలుడుని కాపాడారు. అనంతరం బాలుడిని ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎ. యజ్ఞనారాయణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. దత్తు ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్ బందాలు ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశాయి. బాలుడిని సురక్షితంగా బయటకు తీసిన హైడ్రా బందాలను స్థానికులు అభినందించారు.

# పరీక్షా కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పించాలి

**-విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి రావాలి**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్మీడియట్ మరియు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇంటర్ మరియు పదో తరగతి పరీక్షల నిర్వహణ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వము నిర్ధేశించిన షెడ్యూలు ప్రకారం నిర్వహించుటకు కట్టుదిటమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.

జిల్లాలో మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్, మార్చి ,21 నుండి 04 ఏప్రిల్ వరకు పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తామని, దీనికి తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తెలిపారు. ప్రభుత్వం పరీక్షల నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా పరిక్షలు రాసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు.

ప్రతి పరీక్షా కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాట్లు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద ఏ.ఎన్.ఎం. స్థాయిలో వైద్య సిబ్బంది, ఓ.అర్.ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. జిల్లాలో పరీక్ష ప్రశ్నపత్రాలను నిల్వ జేయుటకు పోలిస్ స్టేషనలో తగిన ఏర్పాట్లు చేయాలని, ప్రశ్నపత్రాలకు పోలిసు ద్వారా బందొబస్తు కల్పించాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించాలని,పరీక్ష కేంద్రాల వద్ద తప్పనిసరిగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, సెంటర్లలో మాస్ కాపీయింగ్ మరియు అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పరీక్షలకు విద్యార్థులకు ఒత్తిడి లేకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయలు వారికి ధైర్యం చెప్పాలని అన్నారు. జిల్లాలో పరీక్షలు నిర్వహించే పరీక్షలకు ప్రశ్న పత్రాలను పోలిసు వారి బందోబస్తు వుంచి తీసుకొని వెళ్లాలని, జిల్లాలోని రెవెన్యూ శాఖ పరీక్షా కేంద్రాలకు ఫ్లైయింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేసి పరీక్ష జరుగుతున్న తీరు పై నిఘా వుంచాలని ,144 సెక్షన్ అమలు చేయాలని, పరీక్షా కేంద్రాల పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల వద్ద మంచి నీరు,ఫ్యాన్లు, లైట్లు సరిఅయిన విదంగా వుండేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని , వెలుతురు వుం డేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అనం తరం సమాధాన పత్రాలను సరిగా సీల్ చేసి పోస్టల్ ద్వారా తరలించే ప్రక్రియ పకడ్బందిగా చెపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సరైన సమయంలో చేరుకునే విధం గా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో లు రాజేశ్వర్, రాధాబాయి,జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్, డి.ఎం.హెచ్.ఓ డా.రజిత, పోలీసు, విద్యా శాఖ, ఫైర్, ఆర్.టిసి, పోస్టల్, సెస్, ట్రాన్స్పోర్ట్ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసీఆర్‌దే..



**- అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది..**

**-ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి..**

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.**

**బలగం టీవీ , వేములవాడ**

ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన ఘనత కేసిఆర్ కి దక్కిందని, అప్పుల కుప్పగా చేసిన రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రతిరోజు 18 గంటలు కష్టపడి పనిచేస్తూ రాష్ట్రాన్ని గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం వేములవాడ పట్టణంలో పట్టభద్రల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పలు పాఠశాలల్లో, బార్ అసోసియేషన్ లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టభద్రులు మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత గా వేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్ రెడ్డి బారీ మెజారిటీతో గెలిపించాలని,గతంలో జీవన్ రెడ్డిని ఆదరించినట్లుగా నేడు నరేందర్ రెడ్డిని ఆశీర్వదించాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో డిఎస్సీ వేశారని,మళ్ళీ గత పదేళ్లుగా డిఎస్సీ బీఆర్ఎస్ ప్రభుత్వం వేయలేదని,మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక డిఎస్సీ వేసామని అన్నారు.

పదేళ్ల లో 55 వేల ఉద్యోగాలు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని,కానీ కాంగ్రెస్ వచ్చాక పది నెలల్లో 55 వేళ ఉద్యోగాలు ఇచ్చామని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో పడవుపడ్డ ప్రాజెక్టులను నేడు ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని, మూలవాగులో,గుడిచెరువులో మురికి నీరు కలవకుండా సుమారు 9 కోట్ల పై చిలుకు నిధులతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.రానున్న 1000 సంవత్సరాల వరకు భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రాజన్న ఆలయాభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

వేములవాడ పట్టణంలోని మూడో బ్రిడ్జి నిర్మాణం టెండర్లు పూర్తయి, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని అన్నారు. రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు,35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణం చేపడుతున్నామని,గుడి చెరువు, మూల వాగులో మురికి నీరు కలవకుండా కాలువల నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.కలికోట సూరమ్మ చెరువు, మరి పెళ్లి చెరువు రిజర్వాయర్, లచ్చపేట తండా కాలువ పనులు కొనసాగు తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీ మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ రావాలని ఆహ్వానించడం జరిగిందని,రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారని అన్నారు.

గత ప్రభుత్వంలో లాగా పనుల్లో జాప్యం చేయకుండా ఆలయం విస్తరణ పనులను వేగవంతం చేయాలని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారని అన్నారు.ఈ ఎన్నిక 42 అసెంబ్లీ నియోజకవర్గలలో జరుగుతున్న ఎన్నికఅని,రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు ఇవ్వడం జరుగుతుందని,బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలలో లేకుండా బీజేపీ తో ఒక లోపాయకారి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పాటు పడుతుందని అన్నారు.

# ఆఫ్ఘనిస్థాన్‌పై దక్షిణాఫ్రికా భారీ గెలుపు

### 107 పరుగులతో విజయం




**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో గ్రూప్–బీలో అఫ్ఘానిస్థాన్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 107 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ర్యాన్ రికెల్టన్ బ్యాట్‌తో.. కగిసో రబడా(3/36) బంతితో చెలరేగడంతో సౌతాఫ్రికా సునాయస విజయాన్నందుకుంది

ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 315 పరుగుల భారీ స్కోర్ చేసింది. ర్యాన్ రికెల్టన్(106 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 103) సెంచరీతో చెలరేగగా.. టెంబా బవుమా(76 బంతుల్లో 5 ఫోర్లతో 58), రాసీ వాన్ డెర్ డస్సెన్(46 బంతుల్లో3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52), ఎయిడెన్ మార్క్‌రమ్(36 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 52 నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. అఫ్గానిస్థాన్ బౌలర్లలో మహమ్మద్ నబీ(2/51) రెండు వికెట్లు తీయగా.. ఫజలక్ ఫరూఖీ, అజ్మతుల్లా ఒమర్జాయ్ తలో వికెట్ తీసారు. అనంతరం అఫ్గానిస్థాన్ 43.3 ఓవర్లలో 208 పరుగులకు కుప్పకూలింది. కగిసో రబడా(3/36) మూడు వికెట్లు తీయగా.. లుంగి ఎంగిడి(2/56), వియాన్ మల్డర్(2/36) రెండేసి వికెట్లు పడగొట్టారు. మార్కో జాన్సెన్, కేశవ్ మహరాజ్ తలో వికెట్ తీసారు.

అనంతరం 316 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఆఫ్ఘన్ జట్టు 43.3 ఓవర్లలో 208 పరుగులకే కుప్పకూలింది. రహ్మత్ షా 90 పరుగులతో ఒంటరిపోరాటం చేశాడు. అతడికి ఇతర బ్యాట్స్ మెన్ నుంచి సహకారం అందలేదు. కెప్టెన్ హష్మతుల్లా షాహిది (0) డకౌట్ అయ్యాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడా 3, లుంగి ఎంగిడి 2, వియాన్ ముల్డర్ 2, మార్కో యన్సెన్ 1, కేశవ్ మహారాజ్ 1 వికెట్ తీశారు.

# ఆర్‌సీబీ విజయాలకు బ్రేక్



### డబ్ల్యూపీఎల్‌లో ఆర్సీబీపై 4 వికెట్ల తేడాతో ముంబై విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

వుమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయాలకు బ్రేక్ పడింది. వరుసగా రెండు విజయాల తర్వాత ఆ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ముంబై ఇండియన్స్‌తో శనివారం సాగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ 4 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఆఖరి వరకు హెూరాహెూరీగా సాగిన ఈ పోరులో ముంబై ఒక్క బంతి మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 167 పరుగులు చేసింది. ఎల్లిస్ పెర్రీ(43 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రిచా ఘోష్(25 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28), స్మృతి మంధాన(13 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 26) పర్వాలేదనిపించారు. ముంబై బౌలర్లలో అమన్‌జోత్ కౌర్(3/22) మూడు వికెట్లు తీయగా.. షబ్నిమ్ ఇస్మాయిల్, నాట్ సీవర్ బ్రంట్, హీలీ మాథ్యూస్, సాంస్క్రిట్ గుప్తా తలో వికెట్ తీసారు.

అనంతరం ముంబై ఇండియన్స్ 19.5 ఓవర్లలో 6 వికెట్లకు 170 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(38 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 50) హాఫ్ సెంచరీతో రాణించగా.. నాట్ సీవర్ బ్రంట్(21 బంతుల్లో 9 ఫోర్లతో 42), అమన్‌జోత్ కౌర్(27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 34 నాటౌట్) మెరుపులు మెరిపించారు. ఆర్‌సీబీ బౌలర్లలో జార్జియా వేర్‌హామ్(3/21) మూడు వికెట్లు తీయగా.. కిమ్ గార్త్(2/30) రెండు వికెట్లు తీశారు.




# రంజీ ఫైనల్‌కు కేరళ

### ఫైనల్‌లో విదర్భతో తలపడనున్న కేరళ

**బలగం టీవీ, హైదరాబాద్**

కేరళ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశించింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో రెండు పరుగుల లీడ్‌తో ఆ జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. మరో సెమీస్‌లో ముంబైపై గెలిచిన విదర్భ ఫైనల్లోకి ప్రవేశించింది.గుజరాత్, కేరళ మధ్య జరిగిన తొలి సెమీఫైనల్ డ్రా అయ్యింది. అయితే ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేరళ ఆధిక్యం సాధించడం వల్ల ఆ జట్టు ఫైనల్‌కు క్వాలిఫై అయ్యింది. రంజీ చరిత్రలో తొలిసారి కేరళ ఫైనల్‌కు ఎంట్రీ ఇచ్చింది. కేరళ తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో కేవలం రెండు పరుగుల ఆధిక్యం మాత్రమే సాధించింది. కానీ లీడ్ వల్ల ఆ జట్టు ఫైనల్‌కు ప్రవేశించింది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 , రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్లకు 114 రన్స్ చేసింది. గుజరాత్ తన తొలి ఇన్నింగ్స్‌లో 455 రన్స్ చేసింది.

రంజీ ట్రోఫీ రెండో సెమీఫైనల్లో ముంబై జట్టుపై 80 రన్స్ తేడాతో విదర్భ విజయం సాధించి ఫైనల్లోకి ప్రవేశించింది. 406 రన్స్ టార్గెట్‌తో రెండో ఇన్నింగ్స్ ఆడిన ముంబై జట్టు.. అయిదో రోజు 325 రన్స్ చేసి ఆలౌటైంది. ముంబై జట్టులో శార్దూల్ ఠాకూర్ హాఫ్ సెంచరీ చేశాడు. విదర్భ బౌలర్ హర్ష్ దూబే.. తన ఖాతాలో అయిదు వికెట్లు వేసుకున్నాడు. విదర్భ ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 383, రెండో ఇన్నింగ్స్‌లో 292 రన్స్ చేసింది. అయితే ముంబై తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 270 రన్స్ మాత్రమే చేసి ఆలౌటైంది. ఫిబ్రవరి 26వ తేదీ నుంచి కేరళ, విదర్భ మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నది.




# ఓటీటీలోకి 'డాకు మహారాజ్'

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్' . ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహించగా.. శ్రద్ధా శ్రీనాథ్, ప్రగ్యా జైస్వాల్ కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్‌ను అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.




# కొల్లగొట్టినాదిరో ప్రోమో రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**


ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం హరిహర వీరమల్లు . పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షఉటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. చిత్రయూనిట్ తాజాగా సెకండ్ సింగిల్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా నుంచి కొల్లగొట్టినాదిరో అనే రెండో సింగిల్ ప్రోమోను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. కోర కోర మీసాలతో కోదమ కోదమ అడుగులతో.. జర జర వచ్చినాడు చిచ్చర పిడుగంటివాడు అంటూ విడుదల చేసిన ప్రోమో గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ పాటలో నిధి ఆగర్వాల్‌తో పాటు అనసుయ కూడా తళుక్కున మెరిసింది. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక ఫుల్ సాంగ్‌ను ఈ నెల 24న విడుదల కానుంది.

# మా అమ్మ ఆరోగ్యంగా ఉన్నారు

### మెగాస్టార్ చిరంజీవి

**బలగం టీవీ, హైదరాబాద్**

మా అమ్మ అంజనాదేవి క్షేమంగానే ఉన్నారు. ఆమె అస్వస్థతకు గురయ్యారంటూ వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు"అని మెగాస్టార్ చిరంజీవి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. మెగాస్టార్ చిరంజీవి మాతృమూర్తి అంజనాదేవి ఆరోగ్యం మీద సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆ వార్తలను మెగాస్టార్ చిరంజీవి ఖండించారు. మా అమ్మ ఆరోగ్యం బాగా లేదని, హాస్పిటల్‌లో చేర్పించామని కొన్ని వార్తలు నా దృష్టికి వచ్చాయి. రెండు రోజులుగా ఆమె ఒంట్లో కాస్త నలతగా మాత్రమే ఉంది. ప్రస్తుతం ఆమె క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారు. మా అమ్మ ఆరోగ్యం గురించి ఎలాంటి ఊహాజనిత వార్తలను మీడియా ప్రచురించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. అవాస్తవాలు ప్రచారం చేయవద్దు" అని అన్నారు.



# నెట్‌ఫ్లిక్స్‌లోకి 'ఎమర్జెన్సీ' .. ఎప్పటినుంచంటే..

**బలగం టీవీ, హైదరాబాద్**



కంగనా రనౌత్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎమర్జెన్సీ'. ఈ చిత్రంజనవరి 17న ప్రేక్షకుల ముందుకొచ్చింది. త్వరలో ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుందని కంగనా ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. నెట్‌ఫ్లిక్స్ లో మార్చి 17 నుంచి ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని వెల్లడించారు. దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఎమర్జెన్సీ చిత్రాన్ని రూపొందించారు. దేశంలో అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఇతివృత్తంగా చేసుకొని ఈ కథ సిద్ధం చేశారు. ఇందిరాగాంధీ కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్, అటల్ బిహారీ వాజ్‌పేయిగా శ్రేయాస్ తల్పడే నటించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది.